క్లుప్తంగా

బాలవికాస సేవలు అభినందనీయం



కేకు కట్ చేస్తున్న అనాథ పిల్లలు

హుస్నాబాద్: బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో శుక్రవారం అనాథ పిల్లల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లలచే కేకు కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. బాలవికాస సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బాలవికాస వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, బాలవికాస మహిళా గ్రూపు ప్రోగ్రాం మేనేజర్ లతా ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ



నియామకపత్రం అందుకుంటున్న కృష్ణ

తొగుట(దుబ్బాక): మండలంలోని తుక్కాపూర్‌కు చెందిన లింగాల కృష్ణ ఎమ్మార్పీఎస్ (దండోరా) జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ శుక్రవారం నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో మాదిగలను సమైక్య పరిచి ఎబీసీడీ వర్గీకరణ కోసం ఉద్యమిస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ నాయకత్వంలో దండోరా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. త్వరలో మండలాలకు నూతన కమిటీలను నియమిస్తామని తెలిపారు.

ముగిసిన డేటా ఎంట్రీ



విజయసంకేతం చూపుతున్న ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ శుక్రవారం నాటికి పూర్తయిందని తహసీల్దార్ ఇంజమూరి సంజీవ్‌కుమార్, ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలో మొత్తం 13,674 దరఖాస్తులు రాగా.. ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి 20 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా దరఖాస్తు ఫారాలను సైతం కార్యాలయంలో పటిష్టంగా భద్రపరిచామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కవికుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతస్థానంలో నిలిచినప్పుడే గుర్తింపు



పుస్తకాలను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఉన్నతస్థానాల్లో నిలిచినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గల జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల కోసం లైబ్రరీ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కరీమొద్దీన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పరమేశ్వరచారి, రాధాకృష్ణ, నేతి శ్రీనివాస్, కార్తీక్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆ ఆరోపణలు అవాస్తవం'

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలో స్థలం కబ్జా చేశానని తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, సొంత డబ్బులతో కొనుగోలు చేశానని కౌన్సిలర్ బ్రహ్మం పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. పట్టణ పరిధిలోని ఓ ప్రాంతంలో ఎకరం 5 గుంటలను ఓ వ్యక్తి నుంచి గతంలో కొనుగోలు చేశానన్నారు. స్థలానికి సంబంధించిన అన్నిరకాల పత్రాలు తమ వద్ద ఉన్నాయన్నారు. ఆ స్థలంపై కొంత మంది రియల్ వ్యాపారులు పత్రాలు సృష్టించి ప్లాట్లుగా విక్రయించారని తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి పూర్తి విచారణ జరిపి తమకు, ప్లాట్లు కొన్న వారికి న్యాయం చేయాలని కోరారు.

పనుల్లో నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం





దుబ్బాకరూరల్: మెదక్ నుంచి సిద్దిపేట, ఎల్కతుర్తి వరకు 765డీజీ జాతీయ రహదారి పనులు గత ఆరు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. హబ్సీపూర్‌లో రోడ్డు పక్కన కల్వర్టుల కోసం గుంతలు తీసి అలాగే వదిలేశారు. పలు చోట్ల కనీసం సూచిక బోర్డులు సైతం ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



జలకళ

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాళేశ్వరం కాల్వలు జలకళను సంతరించుకున్నాయి. శుక్రవారం గజ్వేల్ మండలం కొడకండ్లలోని మల్లన్నసాగర్ కెనాల్ వద్ద యాదాద్రి గండి చెరువును నింపడానికి నీళ్ల వదిలారు. దీంతో మండలంలోని రాయవరం, తిగుల్, జగదేవ్‌పూర్ మీదుగా నిర్మించిన కాల్వల వెంట నీళ్ల పరుగులు పెట్టాయి.

ఘనంగా ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు



హుస్నాబాద్: వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్/సిద్దిపేటజోన్/సిద్దిపేటకమాన్: పట్టణంలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ విజయం కోసం ప్రియాంకగాంధీ శ్రమించారని కొనియాడారు. హుస్నాబాద్‌కు మెడికల్ కళాశాల ఇస్తానని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అనంతరం స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, వల్లపు రాజు, నాయకులు ఎండీ. హుస్సేన్, బాలయ్య, భిక్యానాయక్, కోడం ప్రభాకర్, వీరన్న, భగవాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్తాబాద్ చౌరస్తాలో ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పీసీసీ సభ్యులు చంద్రం, పట్టణ అధ్యక్షుడు అత్తు, తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్‌లో నిరుపేదలకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మార్క సతీష్‌గౌడ్ బ్లాంకెట్స్ పంపిణీ చేశారు.

సుందరీకరణ పనులు చేపట్టాలి



చెరువు కట్టను సందర్శిస్తున్న కొమ్మూరి, అధికారులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట సుందరీకరణ పనులు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఆర్‌ఐ రాజేందర్‌రెడ్డితో కలిసి చెరువు కట్టను సందర్శించారు. ఈసందర్భంగా స్పోర్ట్స్‌కోర్ట్, చిల్డ్రన్స్‌పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట మల్లన్న ఆలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, నాయకులు సనాది భాస్కర్, దాసరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలను బయటపెడతాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక: దుబ్బాక పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలను ఆధారాలతో సహా బయటపెడతామని ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, దుబ్బాక కాంగ్రెస్ అధ్యక్షుడు కొంగరి రవి అన్నారు. శుక్రవారం దుబ్బాక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. పీఏసీఎస్‌లో ఎలాంటి అక్రమాలు జరగకపోతే నోటీసులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. పీఏసీఎస్‌కు వచ్చిన యూరియా, తదితర ఎరువులను ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల్లో అమ్మడం నిజం కాదా అని ప్రశ్నించారు. నోటీస్ వచ్చిన 8 నెలల తర్వాత తనకు అక్రమాలకు ఎలాంటి సంబంధం లేదని చైర్మన్ చెప్పడం సిగ్గుచేటని అన్నారు. మండిపడ్డారు. దుబ్బాకలో జరిగిన భూ అక్రమాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో బీఆర్ఎస్ నాయకులు చేసిన అవకతవకలు బయటపెట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీరాం నరేందర్, ఆకుల భరత్, నరేందర్‌రెడ్డి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న మాదాసు శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో రాణించి ప్రతిభ చాటుకోవాలని గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో శుక్రవారం మండలస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమలోని ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

అలిశెట్టి ప్రభాకర్‌కు నివాళి

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అలిశెట్టి ప్రభాకర్ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా లెఫ్టినెంట్, డా. రాజిరెడ్డి మహేందర్‌రెడ్డి రాసిన పానాది వ్యాస సంపుటిని ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు సాహిత్యపరమైన పుస్తకాలు, నవలలు, కథలు, మినీ కవితలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి మహేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పానాది వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

నేడు సిద్దిపేటలో కైట్ ఫెస్టివల్

సిద్దిపేటజోన్: బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం కోమటిచెరువు వద్ద నిర్వహించనున్న కైట్ ఫెస్టివల్ ఏర్పాట్లను శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం ఎమ్మెల్యే హరీశ్‌రావు కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. వారి వెంట కౌన్సిలర్లు వజీర్, సాయికుమార్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా క్యాలెండర్‌ను శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ జెడ్పీ సీఈఓ రమేష్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

'మోడల్'లో అంకురం బిజినెస్ స్టాల్



హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే వ్యవస్థాపక నైపుణ్యాలు, వినూత్న వ్యాపార ఆలోచనలు పెంపొందించడానికి అంకురం అనే బిజినెస్ వ్యవస్థాపక కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందులో భాగంగా హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం స్టైలిష్ లేడీస్ ఎంపోరియం- జనరల్ స్టోర్‌ను ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, అంకురం బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. స్టాల్‌ను పేరేంట్స్ కమిటీ సభ్యుడు దేవేందర్ నాయక్ తదితరులు సందర్శించారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

జగదేవ్‌పూర్(గజ్వేల్)/కోహెడ(హుస్నాబాద్): రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో శుక్రవారం జగదేవ్‌పూర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన మహిళలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జగదీశ్వర్, చంటి, వాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే కోహెడలో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు, అధ్యక్షుడు గవ్వ వంశీధర్‌రెడ్డి, వలుస సుభాష్, వెల్పుల శంకర్, సుజిత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

కొండపాక(గజ్వేల్): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని గజ్వేల్ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి పండరీ పేర్కొన్నారు. కొండపాకలోని ఐటీసీ కార్యాలయంలో రైతులకు మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగులో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఉంటాయన్నారు. సాగులో వివిధ రకాల అంతర పంటలు కూడా వేసుకుంటూ మరింత ఆదాయం పొందవచ్చన్నారు. రైతులకు సబ్సిడీపై పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ శివారులో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డ్రిప్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేష్, ఏఈఓలు మౌనిక, రమ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న అధికారులు

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లావ్యాప్తంగా వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశ ఖ్యాతిని, సంస్కృతి సంప్రదాయాలను వివేకానంద ప్రపంచానికి చాటి చెప్పారని వక్తలు కొనియాడారు. యువత వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



నంగునూరు: వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మిరుదొడ్డిలో..



మద్దూరు(హుస్నాబాద్): లద్నూరులో..



సిద్దిపేట: వివేకానంద విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



దౌల్తాబాద్: మాట్లాడుతున్న వీహెచ్‌పీ నేత సుభాష్ జాదవ్



గజ్వేల్‌లో వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏసీపీ రమేష్ తదితరులు



దుబ్బాకలో నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **తొగుటలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర**

తొగుట(దుబ్బాక): మండల కేంద్రమైన తొగుటలో శుక్రవారం అధికారులు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ శ్రీధర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాగాల కొండల్‌రెడ్డి, ఉప సర్పంచ్ బాల్‌రాజు, ఎస్‌బీఐ మేనేజర్ ఫణి, మండల వైద్యాధికారి రాధాకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **యువతతోనే దేశ భవిష్యత్**

ములుగు(గజ్వేల్): దేశ బంగారు భవిష్యత్ యువత చేతిలోనే ఆధారపడి ఉందని ములుగు అటవీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.ఎస్ స్త్రీ నిధి అన్నారు. ములుగు అటవీ కళాశాల పరిశోధనా సంస్థలో శుక్రవారం జాతీయ యువజన వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ **స్లాట్ బుకింగ్ డబ్బులు ఇప్పించాలి**

బెజ్జంకి(సిద్దిపేట): ధరణిలో స్లాట్ బుక్కై, సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్ రద్దయిన చలానా డబ్బులు ఇప్పించాలని ఆర్‌టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అలాగే ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన డ్రిప్ కమీషన్ డబ్బులు ఇప్పించాలని కోరారు.

◆ **విద్యార్థులకు వ్యాసరచన పోటీలు**

హుస్నాబాద్: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం యువజన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులకు యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కర్ణాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ **ఆర్థిక సాయం**

గజ్వేల్: గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గల ఏటిగడ్డకిష్టాపూర్‌కు చెందిన జయాల యాదగిరి రోడ్డు ప్రమాదానికి గురై గాయపడగా రాణి మైత్రి అసోసియేషన్ అండగా నిలిచింది. అసోసియేషన్ సభ్యులు రవికుమార్, బండ్ల స్వామి, రామారావు, విజయలక్ష్మి, భ్రమరాంబ శుక్రవారం బాధితుడిని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

◆ **పరామర్శ**

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సీపూర్ ఎంపీటీసీ, వైస్‌చైర్మన్ అస్క రవి తండ్రి సాయిలు అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. అదేవిధంగా మండలంలోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఉన్నారు.

◆ **కళాజాత**

కొండపాక(గజ్వేల్): ఎయిడ్స్ బారిన పడి విలువైన జీవితాన్ని కోల్పోవద్దని సర్పంచ్ పాల్కంపల్లి జయంతి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీసత్య జానపద కళా సమితి బృందం కళాజాత నిర్వహించింది.

◆ **హోంగార్డు కుటుంబానికి అండగా..**

సిద్దిపేటకమాన్: అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి తోటి ఉద్యోగులు శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. హుస్నాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు దిగంబర్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలుసుకున్న తోటి సిబ్బంది రూ. 19 వేలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డు కుటుంబ సభ్యులకు అందజేశారు.

◆ **మద్యం షాపును తరలించొద్దు**

చేర్యాల(సిద్దిపేట): మున్సిపాలిటీ పరిధిలోని మద్యం షాపును గుర్జకుంట ఎక్స్‌రోడ్ వద్దకు తరలించడాన్ని నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం మండల పరిధిలోని వేచరేణి గౌడ సంఘం ప్రతినిధులు ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యం దుకాణం తరలిస్తే గీత వృత్తిదారులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. షాపు తరలింపును నిలిపివేయాలని సీఐ, ఈఎస్, కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు.

◆ **అధైర్య పడొద్దు.. అండగా ఉంటా**

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లికి చెందిన బీజేపీ నాయకుడు దుబాయి శ్రీనివాస్ తండ్రి ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న ఎంపీ బండి సంజయ్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, నాయకులు తదితరులు ఉన్నారు.